PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

విలేకరులు కావలెను.

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు

8074596109, 9676747256

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 136 | 01 మంగళవారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari

## భగీరథ ప్రయత్నంతో
# కరవు సీమకు కృష్ణమ్మ

- 30 ఏళ్ల కల సాకారం..వెలిగొండ ప్రాజెక్టు తొలిదశ ప్రారంభించిన సీఎం
- నల్లమల కొండల్ని చీల్చుకుని నల్లమల సాగర్‌కు కృష్ణమ్మ పరుగు
- తొలిదశతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు..4 లక్షల మందికి తాగునీరు
- జలహారతి అనంతరం కృష్ణా జలాలకు సీఎం సాష్టాంగ నమస్కారం
- 2028లో రెండోదశ పూర్తి...మార్కాపురంలోనూ కృష్ణా పుష్కరాలు
- మార్కాపురం దోర్నాల వద్ద బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగంద



**మార్కాపురం, ఆగస్టు 31ప్రజాసీమ:**

మూడు దశాబ్దాలుగా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలు ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు కల సాకారమైంది. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు. దోర్నాల మండలం గంటవానిపల్లె వద్ద నల్లమల కొండల్లోని జంట సొరంగాల నుంచి వెలువడిన కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, జల హారతి ఇచ్చి స్వాగతి ంచారు. అనంతరం ప్రాజెక్టు తొలిదశ ప్రారంభోత్సవానికి సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కరవునేలను తాకిన కృష్ణా జలాలకు ముఖ్యమంత్రి సాష్టా ంగ నమస్కారం చేశారు. శ్రీశైలం జలాశయంలోని కొల్లం వాగు నుంచి గ్రావిటీ ద్వారా తరలించిన కృష్ణా జలాలు వెలిగొండ జంట సొరంగాల మీదుగా గంటవానిపల్లె అక్వి డెక్టుకు చేరుకుని నల్లమల సాగర్ వైపు పరుగులు తీశాయి. నల్లమల కొండలను చీల్చు కుని కాలువల్లో ప్రవహించిన కృష్ణమ్మకు స్థానిక మహిళలు, ప్రజలు పుష్పాలతో ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం పవిత్ర జలాలను సీఎం చంద్ర బాబు మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులపై స్వయంగా చల్లారు. ...మిగతా 2 లో...

## అమెరికా-కెనడా మధ్య
# వాణిజ్య యుద్ధం

- కెనడా దారుణమైన దుర్వినియోగదారు
- కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు

**వాషింగ్టన్,ఆగస్ట్31ప్రజాసీమ:**



అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్య లకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి.

...మిగతా 2 లో...

## రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్
# రాజీనామా...

- వ్యక్తిగత కారణాలతోనే అంటూ ప్రచారం

**న్యూఢిల్లీ,ఆగస్ట్31ప్రజాసీమ:**



రాష్ట్రపతి 'ఎయిడ్-డి-క్యాంప్ మేజర్ రిషభ్ సింగ్ సాంబ్యాల్ అనూహ్య రాజీనామా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ద్రౌపదీ ముర్ము అధికారిక కార్యక్రమాలు, పర్యటనల్లో ఆమె పక్కన కనిపించే ఆర్మీ అధికారికి సోషల్ మీడియాలో క్రేజ్ ఉంది. తాజాగా ఆయన ముందస్తు పదవీ విరమణ చేయడం చర్చనీయాంశమైంది. 12 ఏళ్ల పాటు సైన్యంలో పని చేసిన రిషభ్ వ్యక్తిగత కారణాలతో ఆర్మీని వీడినట్లు పేర్కొన్నారు.

...మిగతా 2 లో...

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ..
# కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

- 2029లో విజయ్ ప్రధాని అభ్యర్థి అంటూ టీవీకే ప్రచారం
- దీనిపై డీఎంకేతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్ తీవ్ర ఆగ్రహం
- మా పీఎం అభ్యర్థి రాహుల్ గాంధీనేనని స్పష్టం చేసిన కాంగ్రెస్



తమిళనాడులో అధికార టీవీకే (తమిళిగ వెట్రి కళగం) పార్టీ, ముఖ్యమంత్రి విజయ్ ను 2029 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన మంత్రి అభ్యర్థిగా ప్రస్తావిస్తుండడం రాజ కీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనిపై డీఎ ంకేతో పాటు మిత్ర పక్ష మైన కాంగ్రెస్ నాయ కులు తీవ్రంగా స్పం దిస్తూ, వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ఒకవేళ ఇదే ప్రచారం కొనసాగితే మంత్రివర్గం నుంచి వైదొలి గేందుకైనా వెనుకాడబోమని కాంగ్రెస్ హెచ్చరిం చడంతో ఈ వివాదం మరింత ముదిరింది.

...మిగతా 2 లో...




# విశాఖలో ఏఐజి ఆస్పత్రి నిర్మాణం

- 2వేల కోట్ల పెట్టుబడితో 9వేల మందికి ఉపాధి
- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
- ఆలిండియా రేడియో సెంటర్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ

**విశాఖపట్నం,ఆగస్ట్31ప్రజాసీమ::**

ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది. ...మిగతా 2 లో...

## అమెరికాతో ఉద్రిక్తతలు
# భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు...

- ప్రధాని మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ప్రత్యేక భేటీ
- ఉద్రిక్తతలు తగ్గించడానికి భారత్ తన పలుకుబడిని ఉపయోగించాలని విజ్ఞప్తి
- శాంతి స్థాపనకు కృషిని ముమ్మరం చేయాలని నేతల నిర్ణయం
- కష్టకాలంలో అండగా నిలిచినందుకు భారత్‌కు ఇరాన్ ధన్యవాదాలు

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీస్తున్న ఇరాన్-అమెరికా వివాదం పరిష్కారానికి భారత్ చొరవ చూపాలని ఇరాన్ నాయకత్వం అభ్యర్థించింది. కిర్గిజ్‌స్థాన్ వేదికగా జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారత్ తనకున్న దౌత్యపరమైన సంబంధాలను ఉపయోగించాలని ఆయన మోదీని కోరారు.

...మిగతా 2 లో...





## నేపాల్ వరదలతో
## బెంగాల్‌కు బిగ్ వార్నింగ్..
## హిమాలయాల్లో జరిగితే
# ఇక్కడా ముప్పే!

- తూర్పు హిమాలయాల్లో వరుస విపత్తుల ముప్పు
- భూకంపంతో కొండచరియలు, వరదలు సంభవించే ప్రమాదం
- భూకంప ముప్పు ఉన్న జోన్‌లో ఉన్న డార్జిలింగ్
- 2025లో భారీ వర్షాలతో డార్జిలింగ్‌లో 24 మంది మృతి
- బెంగాల్ వరకు చేరిన 2023 సౌత్ లోనాక్ వరద ప్రభావం

నేపాల్-టిబెట్ సరిహద్దులో ఇటీవల సంభవించిన భారీ వరదలు తూర్పు హిమాలయాలపై మరోసారి ఆందోళన పెంచాయి. అక్కడ జరిగిన విపత్తు బెంగాల్‌ను నేరుగా ప్రభావితం చేయక పోయినా.. హిమాలయాల్లో ఒక విపత్తు మరో భారీ ప్రమాదానికి దారి తీసే ప్రమాదాన్ని నిపుణులు గుర్తు చేస్తున్నారు.

# పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

- రేపటి తరాలకు పచ్చని భవిష్యత్తును అందించేందుకు సహకరించాలి
- పారిశ్రామిక వర్గాలకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు

**మంగళగిరి, ఆగస్టు 31ప్రజాసీమ::**



రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి విడుదలయ్యింది. పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం ద్వారా వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని పవన్ కళ్యాణ్ తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి, పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు.అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకు వెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ...మిగతా 2 లో...

# జగన్ రాకతో వెలిగొండకు గ్రహణం

- కూటమి వచ్చాకే పనులు పూర్తి
- జలవనరుల మంత్రి నిమ్మల విమర్శలు

**మార్కాపురం,ఆగస్ట్31ప్రజాసీమ:**



వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ నిర్వాకాలను మంత్రి నిమ్మల రామానాయుడు కడిగిపారేశారు. వెలిగొండ పేరుతో జగన్ చేసిన మోసాన్ని సభలో ఆసాంతం వివరించారు. 2019-2024 మధ్య కాలంలో వెలిగొండ పేరుతో చేసిన దుర్మార్గాలను ఎండగట్టారు. టన్నెల్-2లో టన్నెల్ బోరింగ్ మిషన్ తీయడానికి కనీస ప్రయత్నం చేయకుండానే.. రూ.2 వేల కోట్లకు పైగా పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితమంటూ ఆనాడు జగన్ డ్రామాలాడారంటూ విరుచుకుపడ్డారు. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చర్యలు.. నిర్వాసితుల విషయంలో చంద్రబాబు పెద్ద మనస్సుతో వ్యవహరించారంటూ గత రెండేళ్ల కాలంలో జరిగిన పరిణామాలను మంత్రి వివరించారు. నాడు జగన్ ఇంకా పూరిట్టారని మండిపడ్డారు. టన్నెళ్లల్లోకి కృష్ణా జలాలను పంపి నిజమైన జాతికి అంకితం కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టిందని మంత్రి విమర్శించారు. 2024లో కూటమి రాకతో గ్రహణం వీడిందని తెలిపారు. మార్కాపురం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మంత్రి ప్రసంగించారు. గొడ్డలి పార్టీ హయాంలో విలువైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని ఆగ్రహించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల కంటే ఒక్క నెల ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లుగా జగన్ డ్రామాలు ఆడారని మండిపడ్డారు.

# భగీరథ ప్రయత్నంతో కరవు సీమకు కృష్ణమ్మ

మొదటిపేజీ తరువాయి

అక్విడెక్టు వద్ద రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి స్విచ్ నొక్కి జలాలను దిగువకు వదిలారు. 30 ఏళ్ల క్రితం భూమిపూజ.. నేడు ప్రారంభం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం తన జీవితంలో భావోద్వేగ సందర్భమని చంద్రబాబు పేర్కొన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు భూమిపూజ చేశానని, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత 2026 ఆగస్టు 31న ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభిస్తున్నానని చెప్పారు. సీఎం మాట్లాడుతూ.. "ఆ రోజు చేసిన సంకల్పం.. ఈ రోజు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. ఇది భగీరథ ప్రయత్నం. కొండలు అడ్డు వచ్చినా తొలిచి ముందుకు వెళ్లాం. కరువు నేలకు కృష్ణమ్మను తీసుకొచ్చాం. శ్రీశైలం మల్లన్న సన్నిధి నుంచి బయలుదేరిన కృష్ణమ్మ.. మార్కాపురం చెన్న కేశవుడు కొలువైన నేలకు జలహారతి ఇస్తోంది. ప్రజలు ఇచ్చిన తీర్పుతోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించుకుని జల సిరులతో ఈ ప్రాంత అభివృద్ధికి రెక్కలు తొడిగాం. వెలిగొండ బంగారు కొండ అవుతుంది. ఈ ప్రాంత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. మాట ఇచ్చాం.. ప్రాజెక్టు పూర్తి చేసి కృష్ణమ్మను తరలించాం. ఇక సంపద సృష్టిస్తాం. మార్కాపురం గడ్డకు, కరువుతో పోరాడిన రైతన్నలకు, ఫ్లోరైడ్ బాధలు భరించిన కుటుంబాలకు, నీటి కోసం ఎదురు చూసి అలసిపోయిన తరాలకు కృష్ణా జలాలతో కొత్త ఊపిరి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. నిర్వాసితుల త్యాగాలకు పాదాభివందనం వెలిగొండ ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, గ్రామాలను త్యాగం చేసిన 11 గ్రామాల ప్రజలకు పాదాభివందనం చేస్తున్నానని సీఎం అన్నారు. రైతుల త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. "ప్రాజెక్టు వల్ల లబ్ధి పొందేవారు ఎంత సంతోషంగా ఉంటారో.. నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలి. కేవలం 48 రోజుల్లో 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారం అందించాం. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ నిర్వాసితుల బాధలు, అవసరాలను గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ తేదీని పెంచి 18 ఏళ్లు నిండిన యువతకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున అందించాం. రూ.10,200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన వెలిగొండ ప్రాజెక్టులో ఇప్పటివరకు రూ.7,983 కోట్లు ఖర్చు చేసి మొదటి దశను పూర్తి చేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాలువల పనులు పూర్తి అయ్యాయి. తొలిదశలో భాగంగా నల్లమల సాగర్‌కు 10.70 టీఎంసీల నీటిని తరలిస్తాం. 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వెలిగొండ పూర్తయితే ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 3.36 లక్షల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84 వేల ఎకరాలు, కడప జిల్లాలో 27 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తీగలేరు కాలువ కింద 62 వేల ఎకరాలు, గొట్టిపడియ కాలువ కింద 9,500 ఎకరాలు, తూర్పు ప్రధాన కాల్వ కింద 3.70 లక్షల ఎకరాల ఆయకట్టు సుస్థిరం అవుతుంది. కృష్ణమ్మ రాకతో పశ్చిమ ప్రకాశంలో ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుంది. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు. కరువు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్ర." అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. వెలిగొండకు 2019లో గ్రహణం.. 2024లో విముక్తి" 2019లో గొడ్డలి పార్టీ అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. విలువైన నిర్మాణ కాలాన్ని వృథా చేశారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొరగా చెల్లింపులు చేశారు. ఎన్నికలకు నెల రోజుల ముందు ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పడం, రూ.4 వేల కోట్ల పనులు పెండింగ్‌లో ఉండగానే జాతికి అంకితం చేశామని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమే. ఫేక్ డ్రామాలు, సినిమా సెట్టింగులతో ప్రజల్ని, రైతుల్ని మోసం చేసిన వ్యక్తుల్ని ఏం చేయాలి. రెండు సొరంగాలు మొత్తం తిరిగానని చెప్పుకుంటున్న వ్యక్తులు ఈ ప్రాజెక్టు నుంచి నీళ్లు ఎందుకు ఇవ్వలేదు. పనులు చేసేశామని చెప్పి బుకాయించటం తప్పు. ఫేక్ మాటలు చెప్పే వ్యక్తుల్ని, మోసం చేసిన వారి గురించి ఈ ప్రాంత ప్రజలు నిలదీయాలి. గొడ్డలి పార్టీ హయాంలో సొరంగాల్లో టీబీఎం యంత్రం ఇరుక్కు పోవడంతో పనులు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే సమస్యలను పరిష్కరించి పనులు పూర్తి చేసి ఇప్పుడు కృష్ణా జలాలను అందించింది. చరిత్రను ఎవరూ తిరగ రాయలేరు. ఫేక్ ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడతాం. చెడును ఖండించాలి. మంచి చేసిన ప్రభుత్వానికి అండగా ఉండాలి."అని సీఎం వ్యాఖ్యానించారు.మార్కాపురంలోనూ 2028 కృష్ణా పుష్కరాలువెలిగొండ ప్రాజెక్టు మొత్తం పూర్తికావడానికి మరో రూ.1,900 కోట్ల పనులు చేయాల్సి ఉందని చంద్రబాబు తెలిపారు. వెలిగొండ ఫేజ్-2ను కూడా 2028 నాటికి పూర్తి చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని ప్రకటించారు. మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని, రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌లో మార్కాపురాన్ని భాగం చేశామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతాన్ని సమానంగా అభివృద్ధి చేయడమే ఎన్డీఏ విధానమని, రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంతాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తామని స్పష్టం చేశారు. దేశం ఎదుర్కొంటున్న నీటి సమస్యలకు నదుల అనుసంధానమే పరిష్కారమని చంద్రబాబు అన్నారు. పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తరలిస్తున్నామని, తదుపరి వంశధార వరకూ తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. దక్షిణ భారతదేశంలో గోదావరి-కావేరి అనుసంధానం జరగాలని, మహానది-గంగానదులను అనుసంధానిస్తే దేశం సుభిక్షంగా మారుతుందని ఆకాంక్షించారు. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేలా ఇరిగేషన్ క్యాలెండర్ రూపొందించామని చెప్పారు. ప్రతి వర్షపు నీటి చుక్కను పొదుపు చేసి భూగర్భజలంగా మార్చుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 2028లో జరిగే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా నిర్వహించుకుందామని చంద్రబాబు అన్నారు. గోదావరి జలాలు నల్లమల సాగర్ వరకూ రావాలని, అందుకోసం ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ఓట్లు ఆశించి కాదు.. మార్పు ఆశించి పనిచేస్తున్నామని.. ఎన్నికల కోసం కాదు.. ప్రజల జీవితాలను మార్చేందుకు, భవిష్యత్ తరాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని సీఎం స్పష్టం చేశారు.

సంప్రదాయ పంచెకట్టుతో ఉల్లాసంగా..

తెలుగు సంప్రదాయ పంచె కట్టుతో వెలిగొండ సొరంగాల ద్వారా వచ్చిన కృష్ణా జలాలకు జల హారతి ఇచ్చారు. కృష్ణా జలాలు పసుపు కుంకుమలు చల్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పవిత్ర జలాలను మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులపై చల్లి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఫీడర్ కాలువ వద్ద కృష్ణమ్మ ప్రవాహానికి ముఖ్యమంత్రి సాష్టాంగ నమస్కారం చేశారు. సంప్రదాయ నృత్యాలతో కృష్ణా జలాలకు గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. బహిరంగ సభా వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంపుపై కండువా తిప్పుతూ రైతులకూ, ప్రజలకూ ముఖ్యమంత్రి అభివాదం చేశారు. దివంగత పూలసుబ్బయ్య కుటుంబ సభ్యుల్ని ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేసేందుకు పనిచేసిన అధికారులు, ఉద్యోగాలు, జల వనరుల శాఖ మంత్రి రామానాయుడును సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పి. నారాయణ, కందుల దుర్గేష్, కొలుసు పార్థసారధి, అనగాని సత్యప్రసాద్, గుమ్మిడి సంధ్యారాణి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి సహా ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు హాజరయ్యారు

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

మొదటిపేజీ తరువాయి

ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

## రాష్ట్రపతి భద్రతాధికారి రిషభ్ సింగ్ రాజీనామా...

మొదటిపేజీ తరువాయి

32ఏళ్ల రిషభ్ 2014లో నేషనల్ డిఫెన్స్ అకాడమీ లో చేరారు. మిలిటరీ స్టడీస్, డిఫెన్స్ మేనేజ్‌మెంట్ అభ్యసించారు. '4 పారా స్పెషల్ ఫోర్సెస్'లో పనిచేశారు. ఇందులో ప్రఖ్యాత 'బలిదాన్ బ్యాడ్జ్'ను పొందారు. 2021 గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కెప్టెన్‌గా 'జాట్ రెజిమెంట్' దళానికి నాయకత్వం వహించారు. ఆ ఏడాది జాట్ రెజిమెంట్ ఉత్తమ మార్చింగ్ కంటింజెంట్ ట్రోఫీని గెలుచుకోవడంతో రిషభ్ సింగ్ పేరు మార్మోగింది. అనంతరం 2023లో ఆయన రాష్ట్రపతి ఏడీసీగా ఎంపికయ్యారు. అప్పటి నుంచి ఆయన కెరీర్ కీలక మలుపు తిరిగింది. రాష్ట్రపతి అధికారిక కార్యక్రమాల్లో తరచూ కన్పించడం, ప్రొటోకాల్‌ను అనుగుణంగా భద్రతా విధులను సమర్థంగా నిర్వర్తించడంతో ఆ మధ్య సామాజిక మాధ్యమాల్లో రిషభ్ వైరల్‌గా మారారు. నెటిజన్లు ఆయనకు 'నేషనల్ క్రష్' అనే ట్యాగ్‌ను కూడా ఇచ్చారు. ఇప్పుడు ఉన్నట్టుండి ఆయన పదవి నుంచి వైదొలగడం నెట్టింట చర్చకు దారితీసింది. అయితే, వ్యక్తిగత, కుటుంబపరమైన బాధ్యతల కారణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## విజయ్ ప్రధాని అభ్యర్థిత్వం రగడ.. కాంగ్రెస్, డీఎంకే నేతల ఫైర్

మొదటిపేజీ తరువాయి

ఇటీవల తిరుప్పూర్‌లో నిర్వహించిన ఒక సమావేశంలో టీవీకే సీనియర్ నేత, రెవెన్యూ శాఖ మంత్రి కే.ఏ. సెంగొట్టయన్ మాట్లాడుతూ, విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, దేశాన్ని సమర్థవంతంగా నడిపించగల సత్తా ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన స్థాయి ఎంజీఆర్, జయలలితలను మించి ఉంటుందని ప్రశంసించారు. అంతేకాకుండా, టీవీకే అంతర్గతంగా నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తర్వాత విజయ్ మూడో స్థానంలో ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేస్తున్నాయి.ఈ పరిణామాలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా ఇండియా కూటమి తరపున రాహుల్ గాంధీయే ప్రధానమంత్రి అభ్యర్థి అని ఆ పార్టీ సీనియర్ నేత మాణికం ఠాగూర్ స్పష్టం చేశారు. ఈ నిర్ణయానికి టీవీకే మద్దతు తెలపని పక్షంలో తమిళనాడు మంత్రివర్గం నుంచి కాంగ్రెస్ వైదొలిగే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మరోవైపు, డీఎంకే నేత భారతి ఈ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "ఊహలకు హద్దులుండవు, రేపు విజయ్ ఏకంగా ఐక్యరాజ్యసమితి చీఫ్ అవుతారని కూడా అంటారేమో" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.మరో మిత్రపక్షమైన ఎండీఎంకే సైతం ఈ వాదనను వ్యతిరేకించింది. ఇండియా కూటమికి రాహుల్ గాంధీ మాత్రమే ప్రధానమంత్రి అభ్యర్థి అని, టీవీకే నేతలు ఇటువంటి ప్రచారాలను కట్టిపెట్టాలని సూచించింది. వెరసి, '2029లో విజయ్ ప్రధాని' అనే నినాదం తమిళనాడు అధికార కూటమిలో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా, మిత్రపక్షాల మధ్య పొడచూపిన విభేదాలను బహిర్గతం చేస్తోంది.

## నేపాల్ వరదలతో బెంగాల్‌కు బిగ్ వార్నింగ్.. హిమాలయాల్లో జరిగితే ఇక్కడా ముప్పే!

మొదటిపేజీ తరువాయి

నేపాల్-టిబెట్ సరిహద్దులో ఇటీవల సంభవించిన భారీ వరదలు తూర్పు హిమాలయాలపై మరోసారి ఆందోళన పెంచాయి. అక్కడ జరిగిన విపత్తు బెంగాల్‌ను నేరుగా ప్రభావితం చేయకపోయినా.. హిమాలయాల్లో ఒక విపత్తు మరో భారీ ప్రమాదానికి దారితీసే ప్రమాదాన్ని నిపుణులు గుర్తుచేస్తున్నారు.భూకంపం, కొండచరియలు, మంచు విరిగిపడటం, భారీ వర్షాలు, హిమ సరస్సులు అకస్మాత్తుగా ఉప్పొంగడం.. ఇవన్నీ పరస్పరం ప్రభావితం చేసుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు కొండచరియలు నదిని అడ్డుకుంటే తాత్కాలిక సరస్సు ఏర్పడొచ్చు. ఆ అడ్డంకి తెగితే ఒక్కసారిగా భారీ వరద దిగువ ప్రాంతాలకు దూసుకెళ్లొచ్చు. ఇలాంటి పరిణామాలను 'క్యాస్కేడింగ్ హజార్డ్స్'గా పిలుస్తారు. డార్జిలింగ్‌కు ఎందుకు ముప్పు? డార్జిలింగ్ ప్రాంతం కూడా భౌగోళికంగా సున్నితమైన హిమాలయ వ్యవస్థలోనే ఉంది. నిటారైన కొండలు, భారీ వర్షాలు, కొండచరియలు, భూకంప ముప్పు అక్కడి ప్రమాదాలను పెంచుతున్నాయి. 2025 అక్టోబరులో కేవలం 12 గంటల్లో కొన్ని ప్రాంతాల్లో 300 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురవడంతో భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో 24 మంది మృతి చెందినట్లు 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' అంచనా వేసింది. డార్జిలింగ్ సెస్మిక్ జోన్-4లో ఉంది. దీంతో భారీ భూకంపం సంభవిస్తే ప్రకంపనలతో పాటు కొండచరియలు, రాళ్లు విరిగిపడటం, నదులకు అడ్డంకులు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకోవచ్చు. సిక్కిం ఘటన ఇచ్చిన హెచ్చరిక 2023లో సౌత్ లోనాక్ సరస్సు ఉప్పొంగిన ఘటన ఈ ప్రమాదాన్ని కళ్లకు కట్టింది. భారీ నీటి ప్రవాహం తీస్తా నదిలోకి దూసుకెళ్లి వంతెనలు, రహదారులు, జలవిద్యుత్ ప్రాజెక్టులకు తీవ్ర నష్టం కలిగించింది. ఆ వరద ప్రభావం బెంగాల్ వరకు కనిపించింది. ఐసీఐఎంఓడీ ప్రకారం తూర్పు హిమాలయాల్లో హిమ సరస్సుల ఆకస్మిక ఉప్పెనల ముప్పు 2050 ప్రాంతంలో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల మంచు, శాశ్వతంగా గడ్డకట్టిన నేలల్లో మార్పులు రావడం కొండ ప్రాంతాల స్థిరత్వాన్ని ప్రభావితం చేయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే బెంగాల్‌కు అవసరమైనది వరదలను మాత్రమే ఎదుర్కొనే ప్రణాళిక కాదు. హిమ సరస్సులు, కొండచరియలు, భూకంపాలు, నదీ ప్రవాహాలను కలిపి ముందస్తు హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హిమాలయాల్లో మొదలయ్యే ప్రమాదం వందల కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలకు చేరే అవకాశం ఉన్నందున.. విపత్తు నిర్వహణ కూడా సరిహద్దులు దాటి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

## విశాఖలో ఎఐజి ఆస్పత్రి నిర్మాణం

మొదటిపేజీ తరువాయి

అంతకుముందు మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరించారు. దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీయాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మార్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి

మొదటిపేజీ తరువాయి

పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రవ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన పరిశ్రమల యాజమాన్యాలను పవన్ కళ్యాణ్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విశాఖపట్నం వంటి నగరాలకు సమీపంలో ఉన్న పరిశ్రమలు ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేసి, పట్టణ ప్రజలు కాలుష్య ప్రభావానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీ సిటీ, పరవాడ తదితర ప్రాంతాల్లోని ప్రత్యేక ఆర్థిక మండలాలు (సెజ్‌లు) కూడా 33 శాతం పచ్చదనాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రివర్యులు పిలుపునిచ్చారు.

## భారత్ సాయం కోరిన ఇరాన్ అధ్యక్షుడు...

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా పెజెష్కియాన్ మాట్లాడుతూ.. కష్టకాలంలో తమకు అండగా నిలుస్తున్నందుకు భారత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అమెరికా దౌత్య మార్గాన్ని విడనాడి యుద్ధ మార్గాన్ని ఎంచుకుందని, ఆ దేశంలోని కొన్ని శక్తులు ఈ వివాదం ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. చర్చలు, పరస్పర సహకారంతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్న ఆయన, ఇతర దేశాలు యుద్ధం వైపు వెళ్లకుండా నిరోధించేందుకు భారత్ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రధానమంత్రి మోదీ స్పందిస్తూ, క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇరాన్‌తో భారత్ తన దృఢమైన సంబంధాలను కొనసాగించిందని గుర్తుచేశారు. పెజెష్కియాన్‌ను శాంతికాముకుడిగా అభివర్ణించిన మోదీ, శాంతి స్థాపనలో ఆయన క్రియాశీలక పాత్ర పోషించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు యుద్ధం ద్వారా లబ్ధి పొందాలని చూస్తారన్న విషయాన్ని అంగీకరిస్తూనే, శాంతిభద్రతల పరిరక్షణ కోసం చేసే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని, తుదకు శాంతే విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. హర్మూజ్ జలసంధిలోని లారక్ ద్వీపంలో ఇరాన్ లాంచర్లపై అమెరికా దాడి చేయడం, దానికి ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరంపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించిన మరుసటి రోజే ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. బాహ్య ఒత్తిళ్లు ఉన్నప్పటికీ రవాణా, సముద్రయాన రంగాల్లో భారత్‌తో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఇరాన్ స్పష్టం చేసింది.

# సంపాదకీయం

# హిమాలయమాల్లో వాటర్ బాంబ్స్ !

నేపాల్‌లో సంభవించిన భారీ వరదలు మరోసారి హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సులపై ఆందోళనలను పెంచాయి. ముఖ్యంగా భారత్ ఎగువన హిమాలయాల్లో హిమానీ నదాల పరిస్థితిపై ఆందోళన కలుగుతోంది. మనదేశంలో అలాంటి ఉపద్రవమే జరిగితే పలు రాష్ట్రాలు కొట్టుకుపోక తప్పదు.  హిమానీనదాల కరిగే ప్రక్రియలో ఏర్పడే సరస్సుల్లో భారీ మొత్తంలో నీరు నిల్వ ఉంటుంది. వీటిని నియంత్రించే సహజ మంచు, రాళ్లు లేదా మట్టి అడ్డంకులు బలహీనపడితే ఒక్కసారిగా నీరు బయటకు దూసుకెళ్లే ప్రమాదం ఉంటుంది.  భారీ వర్షాలు, హిమానీనదాల కరుగుదల, కొండచరియలు విరిగిపడటం, భూకంపాలు వంటి కారణాలతో సరస్సు అడ్డంకులు తెగిపోతే దిగువ ప్రాంతాలకు ఒక్కసారిగా భారీగా నీరు, బురద, రాళ్లు, మట్టి కొట్టుకురావచ్చు. అందుకే ప్రమాదకర హిమానీనద సరస్సులను నిపుణులు కొన్నిసార్లు 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తారు. నేపాల్‌లో జరిగిన వరదలు హిమాలయ ప్రాంతాల్లో ప్రకృతి వైపరీత్యాలు ఎంత వేగంగా భారీ విపత్తులుగా మారగలవో మరోసారి చూపిస్తున్నాయి. ముఖ్యంగా హిమానీనద సరస్సుల సంఖ్య, వాటి నీటి నిల్వ సామర్థ్యం, వాతావరణ మార్పుల ప్రభావం, పర్వత ప్రాంతాల్లో పెరుగుతున్న నిర్మాణాలు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. హిమాలయాల్లోని హిమానీనద సరస్సుల ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేస్తే, పర్వత ప్రాంతాలతో పాటు దిగువ మైదాన ప్రాంతాల్లోనూ భారీ వరదలు సంభవించే అవకాశం ఉంది. అందుకే ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, ఉపగ్రహ పర్యవేక్షణ, ప్రమాద మ్యాపింగ్, శాస్త్రీయ ఇంజనీరింగ్ చర్యలు అత్యంత కీలకంగా మారుతున్నాయి. నేపాల్–టిబెట్ సరిహద్దులో హిమానీనదం విస్ఫోటనం కారణంగా భోటేకోశి, త్రిశూలి నదుల్లో భారీగా వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలు, టిబెట్‌లో నదీ మూల ప్రాంతానికి సమీపంలో కొత్తగా తాత్కాలిక సరస్సు ఏర్పడటంతో భోటేకోశి నదిలో నీటిమట్టం మళ్లీ పెరిగినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తత ప్రకటించారు. నేపాల్‌లో జరిగిన ఈ ఘటనతో ఇప్పుడు భారత హిమాలయ ప్రాంతాల్లో ఉన్న హిమానీనద సరస్సుల భద్రతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ సీనియర్ సలహాదారు ఒకరు  తెలిపిన వివరాల ప్రకారం, భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28,000 హిమానీనద సరస్సులు ఉన్నాయి. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారతదేశంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే వీటిలో కొన్ని సరస్సులు అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్న  సరస్సులుగా గుర్తించినట్లు సమాచారం. నేపాల్‌లోని ఘటనలో సహజ పరిస్థితులతో పాటు మానవ కార్యకలాపాలు కూడా నష్టాన్ని పెంచినట్లు నిపుణులు పేర్కొంటున్నారు. టిబెట్, నేపాల్‌లోని పర్వత ప్రాంతాల్లో పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టడం, నదుల సహజ ప్రవాహ ప్రాంతాల్లో నివాసాలు ఏర్పడటం వంటి కారణాలు ప్రమాద తీవ్రతను పెంచే అవకాశం ఉంది. అదేవిధంగా, ఇజీస చిజీసనితినిణ ఃాబబిౖప (ఇచా) సకాలంలో పనిచేయకపోతే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు తగినంత సమయం లభించదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం మరింత పెరిగే ప్రమాదం ఉంటుంది. భారత హిమాలయ ప్రాంతంలోని ప్రమాదకర హిమానీనద సరస్సులు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. హిమాలయ ప్రాంతాల్లోని సరస్సులు పొంగిపొర్లితే ప్రభావం కేవలం పర్వత ప్రాంతాలకే పరిమితం కాకపోవచ్చు. భారీ మొత్తంలో నీరు, మట్టి, రాళ్లు దిగువకు ప్రవహించి నదుల నీటిమట్టాన్ని ఒక్కసారిగా పెంచవచ్చు. ప్రత్యేకంగా నేపాల్ లేదా సిక్కిం ప్రాంతాల్లో భారీ వరదలు సంభవిస్తే కోసి, గండక్, తీస్తా వంటి నదుల ద్వారా నీరు దిగువ మైదాన ప్రాంతాలకు చేరే ప్రమాదం ఉంటుంది. దీంతో ఉత్తర బీహార్‌లోని సుపాల్, సహర్సా, మధుబని, చంపారన్ వంటి ప్రాంతాలు, అలాగే ఉత్తర బెంగాల్‌లోని జల్పైగురి, సిలిగురి, డార్జిలింగ్ టెరాయ్ ప్రాంతాల్లో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. ప్రమాదకర సరస్సులను పర్యవేక్షించేందుకు అధికారులు పలు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.ధిక ప్రమాదం ఉన్న సరస్సుల చుట్టూ ప్రమాద ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త నిర్మాణాలు, నివాసాలను నియంత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరస్సుల్లోని నీటిని సురక్షితంగా బయటకు పంపేందుకు చెక్‌డ్యామ్‌లు, డ్రైనేజీ వ్యవస్థలు, నీటి మళ్లింపు నిర్మాణాలు వంటి చర్యలను పరిశీలిస్తున్నారు.అధిక ప్రమాదం ఉన్న సరస్సుల్లో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్లను ఏర్పాటు చేసే ప్రణాళికలు ఉన్నాయి. నీటి మట్టం, ఉష్ణోగ్రత, ఇతర మార్పులను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ప్రమాదాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. ఉపగ్రహ పర్యవేక్షణ ద్వారా సరస్సుల పరిమాణం, నీటి మట్టం, పరిసర ప్రాంతాల్లో మార్పులను గుర్తించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న హిమానీనద సరస్సుల వద్ద రాబోయే రెండేళ్లలో ఆటోమేటిక్ ముందస్తు హెచ్చరిక సెన్సార్ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఇలాంటి వ్యవస్థలు పూర్తిస్థాయిలో అందుబాటు లోకి వస్తే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి దిగువ ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయడం, అవసరమైతే ఖాళీ చేయించడం సులభమవుతుంది.

# పవన్ స్ఫూర్తితో.. ఆరోగ్య పిఠాపురం దిశగా మరో ముందడుగు

## 365 రోజుల "" కార్యక్రమం ప్రారంభం

## పిఠాపురంలో క్యాన్సర్ స్క్రీనింగ్ కు శ్రీకారం

పిఠాపురం, (ప్రజా సీమ )

"ఆరోగ్య పిఠాపురం – క్యాన్సర్ నివారణ పిఠాపురం" లక్ష్యంగా 365 రోజుల '4' (పవన్ ఇనీషియేటివ్ కేర్ '4' క్యాన్సర్ రీచ్ అవుట్ (ప్రోగ్రాం) కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గంలో శ్రీకారం చుట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే శ్రీ పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని, ఆయన స్ఫూర్తితో ఈ ఆరోగ్య కార్యక్రమాన్ని ర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం సెప్టెంబర్ 2న ఉదయం 9.30 గంటలకు కుమారపురం, హోటల్ గోకులం సమీపంలో ప్రారంభం కానుంది. పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్, క్యాన్సర్‌పై అవగాహన, ఇతర ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించనున్నారు.జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, దంత వైద్యం, క్యాన్సర్ విభాగాలకు చెందిన నిపుణుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి, ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ప్రముఖుల హాజరుఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ నాదెండ్ల మనోహర్, కాకినాడ పార్లమెంట్ సభ్యులు శ్రీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ శ్రీ తుమ్మల రామస్వామి బాబు, కాకినాడ జిల్లా కలెక్టర్ శ్రీ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్, జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీ అపూర్వ భరత్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే శ్రీ పంతం నానాజీ, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే శ్రీ పెండెం దొరబాబు, ఫైన్‌మాన్ కమిటీ పిఠాపురం ప్రతినిధి శ్రీ ఒదురి కిషోర్ తదితర ప్రముఖులు హాజరుకానున్నారు.జనసేన, కూటమి




పార్టీల నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు, శ్రేయోభి .లాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు."క్యాన్సర్‌ను ముందే గుర్తిద్దాం... ప్రాణాలను కాపాడుదాం!" అనే నినాదంతో ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ, ఆరోగ్యకరమైన పిఠాపురం నిర్మాణం దిశగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని డా. బుర్రా దివ్య రాజ్, జనసేన వీరమహిళ,ı విద్యాసంస్థలు ఆసుపత్రుల సహకారంతో నిర్వహించనున్నారు.

# స్వరాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని గర్జించిన ధీరుడు బాలగంగాధర తిలక్

## - నేడు అయిన వర్ధంతి

ప్రజాసీమ:

స్వరాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని స్వాతంత్ర పోరాటంలో గర్జించిన ధీరుడు లోకమాన్య బాలగంగాధరతిలక్. దేశవ్యాప్తంగా సామాన్యప్రజల్ని భారతజాతీయోద్యమంలో పాల్గొనేటట్లు చేయడంలో బాలగంగాధర తిలక్ సఫలీకృతుడయ్యారు. అందుకే ఆయనను భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూలకారకుడు గా భావిస్తారు.అతను జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించడం తో ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. ఇతనికి లోకమాన్య అనే బిరుదు కూడా ఉంది.మహాత్మా గాంధీ అతన్ని "ఆధునిక భారతదేశపు మేకర్" అని పిలిచారు. బాలగంగాధరతిలక్ 1856 జులై 23వ తేదీన మహారాష్ట్ర లోని రత్నగిరిలో జన్మించాడు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు. తల్లి పార్వతీ బాయి ఆధ్యాత్మిక సంపన్నురాలు, బాల్యం లో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణితశాస్త్రంలో ఆయన విశేష ప్రతిభ కనబరచేవాడు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటితనం ఆయనకు సహజం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్యనభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకడు. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు ఆయన తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకువచ్చింది. పుణె ఆంగ్లోవెర్నాకులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్యసించాడు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే .బి. హారాష్ట్రలోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోయింది. మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టుకున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్ మద్దతుదారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటయారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్యవిద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిచాడు – అది భారతీయ సాంస్కృతికవారసత్వాన్ని అగౌరవపరచి భారతీయ విద్యార్థులను చిన్నబుచ్చేవిధంగా ఉందని. ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం బాలగంగాధరతిలక్ ది. భారతీయులకు భారతీయ సంస్కృతి గురించి, భారతదేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అందుకే అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ని స్థాపించాడు. ఆ తర్వాత తాను నడిపిన పత్రికలు మరాఠా(ఆంగ్ల పత్రిక), కేసరి(మరాఠీ పత్రిక) లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశాడు. బాల్యవివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించాడు. జాతీయస్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలిపెట్టలేదు. మొట్టమొదటిసారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం తిలక్ మొదలుపెట్టాడు. పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో తిలక్ కు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష



పడింది. విడుదలయ్యాక స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే గీతారహస్యం అనే పుస్తకం రాశాడు, చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని అభిప్రాయం. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్ను స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్యభారతదేశంలో గ్రామగ్రామానా తిరిగాడు. అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్నివ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించాడు. బాధ్యతాయుత ప్రభుత్వమంటే ఎవరికి బాధ్యత వహించే ప్రభుత్వమో, అధిక ప్రాధాన్యమంటే ఎంత ప్రాధాన్యమో, అసలు అది ఎప్పుడిస్తారో ఏదీ స్పష్టంగా లేదు. కానీ బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని అపేసి ప్రభుత్వానికి తన మద్దతు ప్రకటించింది. అలా ఇద్దరు నాయకులదీ చెరొకదారీ కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడిపోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. 1920 ఆగస్టు 1వ తేదీన బొంబాయిలో 64 ఏళ్ల వయసులో బాలగంగాధర్ తిలక్ స్వర్గస్తులయ్యారు.

# మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి...






- ప్రజా ప్రభుత్వంలో ప్రతి వర్గాలను ఆదుకుంటున్నాం..
- హుజురాబాద్ లో కుట్టు మిషన్ల పంపిణీ.
- పంపిణీకి కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి ల ప్రణవ్ కు మైనారిటీల పక్షాన ధన్యవాదాలు.

ప్రజాసీమ:

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి వర్గాన్ని ఆదుకుం టుందని దాంట్లో భాగంగా మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హుజురాబాద్ మున్సిపల్ చైరో మైనా రిటీలకు 250 కుట్టు మిషన్లను ఉచితం గా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తో కలిసి పంపి ణీ చేశారు.గతంలో ఎన్నడూలేని విధం గా మొదటిసారి మైనారిటీలకు ఈ పథ కాన్ని అందజేస్తున్నామని,రానున్న రోజు ల్లో మరికొన్ని సంక్షేమ పథకాలు మైనారి టీలకు అందిస్తామని,ఈ పథకా నికి కృషి చేసిన రాష్ట్ర ముఖ్యాబు,ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరా వు,హుజు రాబాద్ ఇంచార్జి వొడితల లర్లు,ఆర్డీఓ జల కుమారి,ఎమ్మార్వో నరేంద ర్,అధి కారులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం హర్షణీయం

- కాంగ్రెస్ పాలనలోనే ఆ ప్రాజెక్ట్ సింహభాగం పనులు పూర్తి
- సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది

**వేంపల్లె ప్రజాసీమ:**

వెలిగొండ ప్రాజెక్ట్ మొదటి ఫేజ్ ని ఏపి సిఎం చంద్రబాబు ప్రారంభించడం హర్షణీయం అని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణంలో అన్ని పార్టీల కృషి, భాగస్వామ్యం ఉందని, సింహభాగం పనులు కాంగ్రెస్ హయాంలోనే పూర్తైనట్లు వెల్లడించారు. ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం, కడప జిల్లాల్లో సాగునీరు, ఫ్లోరైడ్ బాధిత ప్రజలకు తాగునీరు అందించేందుకు వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మించాలని కమ్యూనిస్టు నేత పూల సుబ్బయ్య నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు దశాబ్దాల పాటు పోరాటం చేశారన్నారు. దీనికోసం కాంగ్రెస్ హయాంలో ఆ ప్రాజెక్ట్ కు పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ అని నామకరణం చేశారని, 1985లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూపకల్పన జరిగిందన్నారు. 1996 మార్చి 5న గొట్టిపడియ వద్ద అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారన్నారు. కేవలం శంకుస్థాపనకే పరిమితమైందని, 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆ ప్రాజెక్ట్ కు మళ్లీ శంకుస్థాపన చేసి, జలయజ్ఞం కింద చేర్చడమైందన్నారు. ఆ కాలంలోనే సింహభాగం పనులు పూర్తైనట్లు వెల్లడించారు. ఆ ప్రాజెక్ట్ ప్రధాన భాగమైన రెండు భారీ సొరంగాలు, ఒక్కొక్క సొరంగం పొడవు 18.82 కి.మీ.. రెండు సమాంతర సొరంగాల పొడవు 37.64 కి.మీ. దీంట్లో 20.333 కి.మీ పొడవు పనులు కాంగ్రెస్ హయాంలో, 6.686 కి.మీ పొడవు పనులు టిడిపి హయాంలో, 10.568 కి.మీ వైకాపా పాలనలో జరిగాయన్నారు. దీనిని బట్టి చూస్తే వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం కమ్యూనిస్టు, కాంగ్రెస్, వైకాపా, టిడిపి ల కృషి ఉందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఎక్కువ సింహభాగం పనులు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయని స్పష్టమవుతోందన్నారు. సొమ్ము ఒకడిది, సోకొకడిది అన్నట్లు కాంగ్రెస్ పార్టీ, మిగతా పార్టీలు చేసిన కృషిని గుర్తించకుండా మొత్తం ప్రాజెక్ట్ పనులన్నీ తమ హయాంలోనే జరిగినట్లు టిడిపి నేతలు గొప్పలు చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. ఆ ప్రాజెక్ట్ తొలి ఫేజ్ లో పది టిఎంసిలతో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, నాల్గు లక్షల మందికి తాగునీరు మాత్రమే అందగలదని, రెండో ఫేజ్ పనులు కూడా పూర్తి చేస్తేనే ప్రాజెక్ట్ లక్ష్యాలు నెరవేరుతాయని వివరించారు. ప్రాజెక్ట్ కోసం త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసితుల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. నిర్వాసితుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని, రెండో ఫేజ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగం రామకృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధృవకుమార్ రెడ్డి, నాయకులు అమర్నాథరెడ్డి, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

- రాధకృష్ణులను అలంకరణతో భక్తులకు దర్శనభాగ్యం

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక ఓం శాంతి భవనంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్య లు వెల్లడించారు. సోమవారం ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల సబ్ జోనల్ ఇంచార్జ్ లీలా బెహంజీ ఆధ్వర్యంలో అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ వేడుకను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అలాగే రాధకృష్ణులను సుందరంగా అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తీ శ్రద్ధలతో శ్రీకృష్ణ జయంతిని వ్రతంగా ఆచరిస్తే గోదానం చేసిన ఫలితం, కురుక్షేత్రంలో సువర్ణదానం చేసిన ఫలం దక్కుతుందని బ్రహ్మాండ పురాణం చెప్పిన విషయాన్ని స్పష్టం చేశారు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ గితోపదేశం మానవాళికి దిశానిర్దేశమన్నారు. అనంతరం బ్రహ్మ భోజనం ఏర్పాటు చేశారు.



# "నేనే కలకడ మండలానికి సుప్రీమ్" అంటూ దురుసుగా మాట్లాడారు:

## మాదిగల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి

**కలకడ మేజర్ న్యూస్:**

కలకడ ఎంపీడీవో భాను ప్రసాద్ తీరుపై ఆంధ్రప్రదేశ్ మాదిగల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ముల్లంగి చంద్రయ్య తీవ్ర ఆరోపణలు చేశారు. ఎస్సీ సమస్యలపై వివరణ కోరిన తనతో ఎంపీడీవో దురుసుగా మాట్లాడారని, "నేనే మండలానికి సుప్రీమ్" అంటూ వ్యాఖ్యానించారని ఆయన ఆరోపించారు. గోకుల్ షెడ్ నిర్మాణంపై అనుమానాలుగంగాపురం పంచాయతీ పరిధిలో 818/4 సర్వే నంబర్‌లో మంజూరైన గోకుల్ షెడ్ను 821/4లో నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయని చంద్రయ్య తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన బిల్లులు కూడా చెల్లించినట్లు సమాచారం ఉందని పేర్కొంటూ, మంజూరైన స్థలం, నిర్మించిన స్థలం, అనుమతులు, పనుల కొలతలు, బిల్లుల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

**ఎంపీడీవో అందుబాటులో లేరని ఆరోపణ**

వివరణ కోసం ఎంపీడీవో కార్యాలయానికి రెండు రోజుల పాటు వెళ్లినా ఆయన అందుబాటులో లేరని చంద్రయ్య తెలిపారు. అనంతరం ఫోన్‌లో ప్రశ్నించగా తనతో దురుసుగా మాట్లాడారని ఆరోపించారు.

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు..**

**ఆందోళనకు హెచ్చరిక**

గోకుల్ షెడ్ వ్యవహారంతో పాటు ఎంపీడీవో వ్యవహారశైలిపై జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని చంద్రయ్య కోరారు. సమస్యలపై స్పందన లేకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.
అయితే ఈ ఆరోపణలపై ఎంపీడీవో భాను ప్రసాద్ లేదా సంబంధిత అధికారుల అధికారిక వివరణ ఇంకా వెలువడాల్సి ఉంది



# పాఠశాలల్లో జంక్ ఫుడ్ నియంత్రించాలి

- ఎంఇఓకు బిజెపి నేతలు వినతిపత్రం

**వేంపల్లె ప్రజాసీమ:**

పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్ విక్రయాలను అన్ని పాఠశాలల్లో నియంత్రించాలని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక ఎంఇఓ వెంకట్రామిరెడ్డిని బిజెపి నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణాల్లో, సమీప ప్రాంతాల్లో జంక్ ఫుడ్ విక్రయాలు కొనసాగుతున్నాయని, వీటి వల్ల విధ్యార్థులకు పోషకాహారం లోపించి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. విద్యతోపాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని నేర్పాల్సిన ప్రదేశాల్లో అధిక ఉప్పు, చక్కెర, కొవ్వు కలిగిన చిరుతీళ్లు, శీతల పానీయాలు, ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్ అందుబాటులో ఉండడం ఆందోళనకర విషయమన్నారు. విధ్యార్థుల ఆరోగ్యమే దేశ భవిష్యత్ అని, వీరి ఆరోగ్య పరిరక్షణపై నిర్లక్ష్యం వహించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత, రవి యాదవ్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# అన్నమయ్యను సత్వరమే కరువు జిల్లాగా ప్రకటించాలి

- రైతాంగాన్ని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి
- వైకాపా రైతు విభాగం నియోజకవర్గం అధ్యక్షులు జన్నే రాజేంద్ర నాయుడు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

ఎల్నినో ప్రభావంతో వర్షాలు కురవక కరువు కాటకాలతో అన్నమయ్య జిల్లా,మదనపల్లె నియోజకవర్గం రైతులు విలవిలాడుతున్నారని,కావున అన్నమయ్య జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని వైఎస్సార్సీపీ రైతు విభాగం మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షులు జన్నే రాజేంద్ర నాయుడు డిమాండ్ చేశారు.సోమవారం వైకాపా నాయకులతో కలిసి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జన్నే రాజేంద్ర నాయుడు మాట్లాడుతూ ఈఏడాది సరైన వర్షాలు లేక కరువు ఛాయలు అలముకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే టమోటా ధరలు పతనమై జిల్లా రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారని,ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులు మూలిగే నక్కమీద తాటిపండు పడ్డ చందంగా మారిందన్నారు.దివంగత నేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరువు జిల్లాల్లో పంటనష్టము క్రింద ప్రతి సంవత్సరము ఒక ఎకరానికి రూ.5 వేల నుండి 10 వేలు నష్టపరిహారం కింద అందేశారని గుర్తుచేశారు.ప్రస్తుతం వర్షాలు లేక మెట్ట ప్రాంత భూములన్ని బీడు భూములుగా మారియాని,కనీసం పశుగ్రాసం కూడా దొరకని దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు.కావున అన్నమయ్య జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించేందుకు కలెక్టర్ చొరవ చూపాలని కోరారు.అలాగే టమోట సాగుచేసి నష్టపోయిన రైతులను,వేరుశనగ రైతులకు నష్టప రిహారం అందజేయాలన్నారు .దివంగతనేత వై.యస్.రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన పంట నష్టపరిహార విధానాన్ని రాయలసీమ జిల్లాలో అమలు చేయాలని,దేశాన్ని వెన్నెముకలాంటి రైతులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎన్.విజయ్ భాస్కర్ రెడ్డి,గువ్వల నాగరాజ రెడ్డి, విజయ్ కుమార్,నాగరాజ, కదిరపతి,తట్టి నాగరాజ రెడ్డి,వై.రెడ్డెప్ప రెడ్డి,జి.చలపతి నాయుడు,ఎం.పవన్ కువ ార్ రెడ్డి,ఎన్.నాగరాజ,బి. గంగులప్ప, ఎస్.రమణ,జె.హరినాథ్,మాధవరెడ్డి,సాంబ శివరెడ్డి,ఆవుల సోమశేఖర్ రెడ్డి,యర్రయ్య, రామారావు ,వినుతా భాయి,మంజుల, తదితరులు పాల్గొన్నారు.



# మంగంపేటలో ఓటర్ల డ్రాఫ్ట్ నోటీసులపై విచారణ

సరైన పత్రాలతో హాజరుకావాలని తల్లెం భరత్ కుమార్ రెడ్డి పిలుపు

**రైల్వే కోడూరు, ప్రజా సీమ:**

తిరుపతి జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లి మండలం పరిధిలోని మంగంపేట గ్రామపంచాయతీ బూత్ నెంబర్ 172లో డ్రాఫ్ట్ నోటీసులకు సంబంధించిన విచారణ (హీరింగ్) కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, బిఎల్ఎ చంటితో కలిసి నోటీసులు అందుకున్న ఓటర్లకు అవగాహన కల్పించారు. డ్రాఫ్ట్ నోటీసులు పొందిన ప్రతి ఒక్క ఓటరు తక్షణమే విచారణ జరుగుతున్న ప్రాంతానికి చేరుకోవాలని వారు సూచించారు. ఓటర్ కార్డుతో పాటు దానికి సంబంధించిన సరైన ఆధార పత్రాలను (డాక్యుమెంట్లను) జతచేసి అధికారులకు అందించి స్పందించాలని కోరారు.ఓటు హక్కు పరిరక్షణ మరియు సరిదిద్దుబాట్ల కోసం ప్రతీ ఒక్కరూ బాధ్యతాయుతంగా ఈ విచారణకు హాజరుకావాలని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు ఓటర్లు పాల్గొన్నారు.





# రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి హామీని నిలబెట్టుకోవాలి

- ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ డిమాండ్
- అన్నమయ్య జిల్లా కలెక్టరుకి వినతి పత్రం సమర్పణ

**మదనపల్లె (ప్రజా సీమ) :**

రాష్ట్రంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఏపి రజక ఎస్సీ సాధన కమిటీ పిలుపు మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అన్నమయ్య జిల్లా కలెక్టరుకి సాధన కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర కన్వీనర్ అక్కినపల్లి లక్ష్మయ్య ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం అందజేసి తమ ఈ డిమాండ్ ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశామన్నారు.1985లో స్వర్గీయ ఎన్టీఆర్ క్యాబినెట్లో ఆమోదించి కేంద్రానికి పంపిన విషయం,ఎన్నికల ముందు 2014లో తెలుగుదేశం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విషయం,గవర్నర్ ప్రసంగంలో రజకులను ఎస్సీ జాబితాలో చేర్పించుటకు కట్టుబడి ఉన్నామని తెలిపిన విషయం,2018 ఎన్నికలకు మూడు నెలల ముందు అధ్యయన కమిటీ వేసిన విషయం,2024 ఎన్నికల ముందు బీసీ డిక్లరేషనులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయాలను వినతి పత్రంలో పొందుపరిచామన్నారు.భారత దేశంలో 18 రాష్ట్రాలు,మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో రజకులు షెడ్యూల్ క్యాస్ట్ జాబితాలో ఉన్నాయని,ఏపిలో బీసీ జాబితాలో ఉన్నారన్నారు.2014లో చంద్రబాబు నాయుడు టిడిపి పార్టీ మేనిఫెస్టో పెట్టడం,మహానాడులో తీర్మానం చేయడం జరిగిందన్నారు.చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రజకుల చిరకాల ఆకాంక్ష అయిన రజకుల ఎస్సీ జాబితా కల సాకరమవుతుందని 90 శాతం మంది రజకులు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేయడం జరిగిందన్నారు.కావున రజకుల వెనుకబాటుతనాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే ఎస్సీ జాబితాలో చేర్చాలని వారి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీ రజక ఎస్సీ సాధన కమిటీ కోర్ కమిటీ సభ్యులు ఎం.నాగరాజు,సభ్యులు పి.రమేష్ బాబు,అర్జున్ కుమార్,రవి,కేశవ,పి.వెంకట లక్ష్మీదేవి,కె.రెడ్డెప్ప,అన్నయ్య,ఏ.శ్రీనివాసుల ు,గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ప్రజాసీమ

## సమస్యల పరిష్కారానికై విశ్రాంత ఉద్యోగుల నిరసన

### - అమరావతి జేఏసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరుకి వినతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

విశ్రాంత ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారించాలని అమరావతి జేఏసి పోరాట సమితి డిమాండ్ చేసిందిఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం అమరావతి జేఏసీ ప్రకటించిన పోరాట కార్యక్రమంలో భాగంగా సోమవారము మదనపల్లి లోని అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి జిల్లా కలెక్టర్ కి దశలవారీ పోరాట కార్యక్రమ వివరాలను అందజేశారు.అన్నమయ్య జిల్లా అమరావతి జేఏసీ చైర్మన్ నరసింహ కుమార్ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ రెడ్డి,మదనపల్లె యూనిట్ అధ్యక్షులు బివి రమణ,జనరల్ సెక్రటరీ డాక్టర్ మునిగోపాలకృష్ణ,కేశవరెడ్డి,మురళి,లక్ష్మీనారాయణ, శంకరయ్య,జనార్ధన్,రామచంద్రయ్య,రాజన్న తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పిఆర్సి కమిషన్,మధ్యంతర భృతి,డిఎ,డి.ఆర్ బకాయిలు,అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్,పెండింగులో ఉన్న ఐదు డిఏలు,డిఆర్ లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అదే విధంగా సీఎం సార్ మా డబ్బులు మాకు ఇవ్వండి అంటూ నినాదాలు చేశారు.విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారని హర్షం వ్యక్తం చేశారు.



## దుర్గాడ శివాలయంలో వైభవంగా పుష్పాభిషేకం

### -స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎంపీ గీత

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**





గొల్లప్రోలు మండల పరిధి దుర్గాడ గ్రామంలో గల పురాతన శివాలయంలో సంకటహర చతుర్థిని పురస్కరించుకుని సోమవారం శివ,గణనాథులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి నయనానందకరంగా పుష్పాభిషేకం చేశారు.ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ట జరిగి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 108 రోజుల భజన కార్యక్రమాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.ఈ స్వర్ణోత్సవ, బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9వ రోజున కాకినాడ మాజీ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్,గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజుతో పాటు మండల పరిధిలోని పలువురు ఎంపిటిసి సభ్యులు,వైసిపి నాయకులు ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయంలో రికార్డు స్థాయిలో జరుగుతున్న భజన కార్యక్రమాలను ఆమె ఆసక్తిగా పరిశీలించారు.ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు,దత్తు సోదరులు ఆలయ ఉత్సవాల విశిష్టతను, స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల వివరాలను ఆమెకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ సభ్యులు మాజీ ఎంపీ గీతకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు."

## ఉపముఖ్యంత్రి జన్మదిన వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతి కారి కృష్ణ

**సిద్ధవటం (ప్రజా సీమ)**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతి కారి కృష్ణ తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం లో ఆయన సోమవారం మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని సెప్టెంబర్ 2న భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని రాజంపేట ప్రభుత్వ జూనియర్ కాలేజ్ నుండి తోట కళ్యాణ మండపం వరకు 500 మందికి పైగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఉదయం 11 గంటలకు యువతను ఉద్దేశించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రసంగం చేస్తారని ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు వీర మహిళలు ప్రతి ఒక్కరూ పాల్గొనాలని తెలిపారు ఈ కార్యక్రమంలో గీతాంజలి విద్యా సంస్థల అధినేత ఎస్వి రమణ సిద్ధవటం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి శ్రీకాంత్, ఒంటిమిట్ట సింగల్ విండో చైర్మన్ జై కృష్ణ, చిన్న వెంకటయ్య, ఏఎంసీ డైరెక్టర్ మహబూబ్ బాషా, పసుపులేటి గంగయ్య, కొరముట్ల హరి తదితరులు పాల్గొన్నారు






## మిట్స్ యూనివర్సిటీలో ఆకట్టుకున్న ఇన్నోవేషన్ నెక్సస్ హ్యాకథాన్

### - హాజరైన ఐఐఎస్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్ తలబట్టుల






**మదనపల్లె (ప్రజా సీమ) :**

మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు ఈ.సి.ఈ విభాగం వారు పాత్‌విజన్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మరియు కిసాన్ ప్రో టీమ్ సహకారంతో సోమవారం రెండు రోజులపాటు ఇన్నోవేషన్ నెక్సస్-2026,16 గంటల ఇన్నోవేషన్ మరియు హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) ఈసీఈ విభాగం ప్రొఫెసర్ శ్రీనివాస్ తలబట్టుల,వైస్ ఛాన్సల్లర్ డాక్టర్ సి.యువరాజ్ మరియు అధ్యాపకులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ హ్యాకథాన్ అనేది కేవలం పోటీ మాత్రమే కాదని,విద్యార్థులకు తరగతి గదికి వెలుపల ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పరీక్షించుకునే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమమన్నారు. హ్యాకథాన్‌ల ద్వారా విద్యార్థుల్లో సమస్య పరిష్కారం ,విమర్శ నాత ్మక ఆలోచన,కమ్యూనికేషన్, సృజనాత్మకత,ఆవిష్కరణ,ప్రాజెక్టు అభివృద్ధి వంటి నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు.పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.పరిమిత సమయంలో బృందంగా పనిచేసి ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతాయన్నారు.పరిశ్రమ అవసరాలు, పరిశోధనా విధానాలు,అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.ఈ హ్యాకథాన్ లో 170 మందికిపైగా విద్యార్థులు 50 బృందాలుగా పాల్గొని,టెక్నాలజీ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించేలా తమ వినూత్న ఆలోచనలు ,సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రదర్శించారు.హ్యాకథాన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బృందాలకు ప్రథమ బహుమతిని టీమ్ టెక్ విజన్-మిట్స్ రూ.25,000,ద్వితీయ బహుమతిని టీమ్ ఏజీఎస్-మిట్స్ రూ.15,000,తృతీయ బహుమతిని టీమ్ కేఎంపీవో ఇన్నోవేటర్ - మిట్స్ రూ.10,000 నగదు బహుమతి అందుకున్నారు.ఇందులో బెంగళూరుకు చెందిన గీతం యూనివర్సిటీ,ఈసీఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత పాండా మరియు పాత్‌విజన్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ యతీంద్ర నాథ్ రెడ్డి దేవసాని పాల్గొని విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్,ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ సంజయ్ కుమార్ సి.గోరె,కో-ఆర్డినేటర్స్ డాక్టర్ సిమాద్రి బదత్యా,డాక్టర్ నూరుల్ ఇస్లాం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో నాసిరకంగా రక్షిత మంచినీటి పైప్‌లైన్ పనులు

### -ఏఐఐబీ నిధులు కాంట్రాక్టర్ల పాలు

### -ఇసుకకు బదులు మట్టి,రాళ్లతోనే పూడ్చివేత

### -అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం





**కాకినాడ జిల్లా (ప్రజా సీమ )**

గొల్లప్రోలు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రక్షిత మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం నాసిరకంగా జరుగుతోందని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం ఏఐఐబీ (ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్) నిధులతో కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ పనులను నిర్వహిస్తుండగా క్షేత్రస్థాయిలో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది.నిబంధనల ప్రకారం పైప్‌లైన్ వేసేటప్పుడు గొయ్యిలో పైపుల చుట్టూ ఇసుకను ఉపయోగించాల్సి ఉండగా కాంట్రాక్టర్ అందుకు విరుద్ధంగా తవ్విన మట్టిని,రాళ్లను వేసి పూడ్చేస్తున్నారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అత్యంత నాసిరకమైన పైపులను వినియోగిస్తున్నారని,దీనివల్ల భవిష్యత్తులో ఒత్తిడికి తట్టుకోలేక పైప్‌లైన్ త్వరగానే పగుళ్లు ఇచ్చి లీకేజీలు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పనులు జరుగుతున్న ప్రాంతంలో పర్యవేక్షించాల్సిన సంబంధిత అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు కానిచ్చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.గొల్లప్రోలు ప్రజల త్రాగునీటి కష్టాలు తీర్చేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో ఏలేరు ప్రాజెక్టు నుండి పైప్లైన్ ద్వారా త్రాగునీటి అందించేందుకు కోట్లాది రూపాయలు వ్యయంతో ఈ పనులు చేపట్టారు.ఒకవైపు రక్షిత మంచినీటి ట్యాంకుల పనులు జరుగుతుండగా, మరోవైపు పట్టణ పరిధిలో పైప్లైన్ ఏర్పాటు చేస్తున్నారు.అయితే పైప్ లైన్ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యతకు త్రిలోదకాలు ఇచ్చినట్లు తెలుస్తుంది.కోట్లాది రూపాయల ప్రజాధనం వృధా అవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ఉన్న అంతరార్థం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, నాసిరకం పైపులను తక్షణమే తొలగించి నాణ్యమైన పైపులను ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.అలాగే మట్టి,రాళ్లకు బదులుగా నిబంధనల ప్రకారం ఇసుకను మాత్రమే ఉపయోగించి పనులు పారదర్శంగా జరిగేలా చూడాలని కోరుతున్నాడు.

## సిద్ధవటంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ విశేష పూజలు





**సిద్ధవటం (ప్రజా సీమ)**

శ్రీశైల దేవస్థాన దత్తత దేవాలయమైన సిద్ధవటక్షేత్రంలోని శ్రీకామాక్షీసమేత సిద్ధవటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ రోజు (31.08.2026) నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించబడింది. గత మూడు రోజులుగా అనగా ఈ నెల 29వ తేదీ నుంచి ఈ నూతన ధ్వజస్తంభ మహోత్సవ కార్యక్రమాలు జరిపించబడ్డాయి. కాగా ఈ ఉదయం గం.8.00లకు వేదపారాయణలు జపములు నిర్వహించి ఆ తరువాత నిర్ణయించడిన సుముహూర్తం గం. 10.51 ని.లకు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. ఆలయ వైభవాన్ని ప్రతిబింబించే విధంగా ధ్వజస్తంభాన్ని ప్రతీ ఆలయంలో మనం చూస్తాం. ఆలయంలోని నాలుగు ముఖ్యమైన భాగాలలో ధ్వజస్థంభం ఒకటి. గర్భగుడి, మూలమూర్తి, బలిపీఠం, మిగిలిన మూడు. ఆలయంలోని ఈ నాలుగింటిని ఆగమశాస్త్రాలు ఎంతో విశేషంగా పేర్కొన్నాయి. ఆలయంలో ఉత్సవాది కార్యక్రమాలు నెరవేర్చాలంటే ధ్వజారోహణ జరగాలి. ఆ ధ్వజారోహణానికి ధ్వజస్తంభం అత్యంత అవసరం. కనుక ఆ ధ్వజస్తంభం ప్రాముఖ్యతను ఆగమశాస్త్రం ఎన్నోరకాలుగా చెప్పింది. ధ్వజస్తంభంలో త్రిమూర్తులు కొలువుతీరి ఉంటారని, ధ్వజస్తంభం మేఖలాలతో, చిరుగంటలతో, విశ్వశక్తిని స్వీకరించి, ఆలయకీర్తిని నలుదిశలా వ్యాపింపజేసే శక్తి కలిగి ఉంటుందని, లోకసుభిక్షం కోసం, కరువు కాటకాలు, సకలరోగాలు దూరమై సకల సంపదలకు ఆ ప్రాంతం ఆలవాలమై ఉంటుందని ఆగమశాస్త్రంలో ధ్వజస్తంభ మరియు ధ్వజ ప్రతిష్ఠ విషయమై చెప్పబడింది. ధ్వజస్తంభ ప్రతిష్ఠా అనంతరం ఆయా దేవతలకు ఎనిమిది దిక్కులా బలిహరణ, పూర్ణాహుతి జరిపించబడింది. అవభృథం, మహదాశీర్వ చనంతో కార్యక్రమాలు ముగిశాయి. ఈ కార్యక్రమానికి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ చిట్టిబొట్ల భరద్వాజశర్మ, పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ సిద్ధవటం - జ్యోతి ఆలయాలను దశలవారిగా అభివృద్ధి చేస్తామని, భక్తులు అధికసంఖ్యలో ఈ ఆలయాన్ని సందర్శించే విధంగా తగు ప్రచారం కల్పిస్తామని అన్నారు. అనంతరం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఆలయాలు దేవస్థాన దత్తత పొందినప్పటి నుండి ఆలయ కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా ఆగమశాస్త్ర సంప్రదాయం ప్రకారంగానే నిర్వహించబడుతు న్నాయని తెలిపారు. అలాగే భక్తులకు మౌలికసదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమము లో స్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు వై. విజయకుమార్, వేదపండితులు గంటిరాధకృష్ణశర్మ అవధాని, పలువురు వైదిక సిబ్బంది, అర్చకులు, పలువురు అధికారులు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయండి

## - మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ పిలుపు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

సెప్టెంబర్ 2వ తేదీ అనగా బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన సందర్భంగా పెద్దఎత్తున కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు.సోమవారం కమ్మవీధి జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.2వ తేది ఉదయం 9 గంటలకు మిషన్ కాంపౌండ్ నుండి ర్యాలీ చిత్తూరు బస్టాండ్,టౌన్ బ్యాంక్ సర్కిల్,బెంగళూరు బస్టాండ్,ఎన్టీఆర్ సర్కిల్,నీరుగట్టువారిపల్లె,శ్రీదేవి గార్డెన్ వరకు ర్యాలీ,అనంతరం పవన్ కళ్యాణ్ శ్రీదేవి గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లైవ్ లో యువజన విభాగ ప్రకటన మరియు సందేశాన్ని,ఆనంద క్షణాల్ని ఎల్ఈడి స్క్రీన్ మీద వీక్షించే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.ప్రతి ఒక్కరూ ఉదయం 8.30 గంటలకు మిషన్ కాంపౌండ్ దగ్గరకి కచ్చితంగా రావాలని సూచించారు. జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ మరియు మదనపల్లె ఇన్‌చార్జ్ గంగారపు రామదాస్ చౌదరి అధ్యక్షతన మదనపల్లె ఏఎంసీ చైర్మన్ జంగాల శివరామ్ రాయల్ మరియు టౌన్ ప్రెసిడెంట్ నాయని జగదీష్,టౌన్ ఉపాధ్యక్షులు పురం నగేష్,కొలిమి ప్రసాద్,మదనపల్లె రూరల్ అధ్యక్షులు రోణూరు బాబు,ఉపాధ్యక్షులు సువరపు చంద్రశేఖర్,కుమార్,నిమ్మనపల్లి మండల ప్రెసిడెంట్ ప్రదీప్ సింగ్,ఉపాధ్యక్షులు హర్షవర్ధన్,అఫ్రోజ్ ఖాన్,రామసముద్రం మండలం అధ్యక్షులు హోసూరు చంద్రశేఖర్,మదనపల్లె సీనియర్ నాయకులు తోట కళ్యాణ్,చేనేత విభాగ



రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర,బీసీ నాయకులు బండి మనోహర్,ఉపాధ్యక్షులు చాకలి విశ్వనాథ్,గడ్డం లక్ష్మీపతి,ఉమ్మడి చిత్తూరు జిల్లా జాయింట్ సెక్రెటరీ సనావుల్లా,గజ్జల రెడ్డప్ప,సివిల్ సప్లై డైరెక్టర్ వైఎస్ మునిరత్నం ,వీరమహిళలు పద్మావతి,మల్లిక,నాగవేణి ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు,మెగా అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# విధి నిర్వహణలో పోలీసుల సేవలు అమూల్యమైనవి

## - జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రశంసలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఘనంగా సత్కరించి,జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో సత్కారం అందుకున్న వారిలో హెడ్ క్వార్టర్స్ ఆర్ఎస్ఐ ఎస్.అల్లావుద్దీన్,సుండుపల్లి ఏఎస్ఐ ఎస్.వెంకటేశ్వర్లు,పీలేరు ఏఎస్ఐ జె.మల్లిఖార్జున ఉన్నారు.వృత్తి పట్ల అంకితభావంతో వీరు అందించిన సేవలు అభినందనీయమని కొనియాడిన ఎస్పీ,వీరికి రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ త్వరగా అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి,ఎస్బి సీఐ యు.సదాశివయ్య,ఆర్ఐలు ఎం.రవికుమార్,కె.సురేష్ కుమార్ రెడ్డి,పోలీసులు,పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.





# పారిశ్రామిక అభివృద్ధితో యువతకు ఉపాధి

## -ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం.. 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యం

## సెప్టెంబర్ 5న కాకినాడలో వర్క్‌షాప్

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**కాకినాడ జిల్లా (ప్రజా సీమ**

కాకినాడ, పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసి స్థానిక యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ 'ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త' లక్ష్య సాధన దిశగా ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న కాకినాడలో వర్క్‌షాప్ నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు.సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో 32వ ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, వాటి పురోగతిపై కమిటీ సభ్యులతో కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో పారిశ్రామిక రంగ అభివృద్ధికి ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని, స్థానికంగా లభించే వనరులు, మానవ వనరుల ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా యువతను పారిశ్రామిక రంగం వైపు ఆకర్షించి స్వయం ఉపాధితో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ఎంఎస్ఎంఈ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహికులకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు, రుణ సదుపాయాలు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 5న నిర్వహించే వర్క్‌షాప్ ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు



సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

# కాంగ్రెస్ పార్టీతోనే మైనార్టీల సంక్షేమం,అభ్యున్నతి సాధ్యం

## - ముస్లిం మైనార్టీలను జాగృతం చేసేందుకే జిల్లాల పర్యటనలు

## - కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎస్.కె బాషా

**మదనపల్లె (ప్రజా సీమ) :**




కాంగ్రెస్ పార్టీ మైనార్టీల పక్షపాతి అని మైనారిటీ విభాగం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా.ఎస్.కె బాషా అన్నారు.ముస్లిం మైనార్టీలను జాగృతం చేసేందుకు జిల్లాల పర్యటనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా సోమవారం ఆయన మట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు దాదాగాంధీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నవాబ్ జాకిర్ హుస్సేన్ పర్యవేక్షణలో తిరుపతి జిల్లాలో గూడూరు,చిత్తూరు జిల్లాలో పలమనేరు,అన్నమయ్య జిల్లాలో రాయచోటి నందు సమావేశాలు నిర్వహించడం జరిగిందని వెల్లడించారు.ఈ సందర్భంగా డా.ఎస్.కె బాషా మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు.దేశ వ్యాప్తంగా అన్ని వర్గాలలోనూ మార్పు మొదలైందని,ఎన్డీఏ ప్రభుత్వం,ఇండియా కూటమి గురించి ప్రజలు ఆలోచించడం మొదలు పెట్టారని తెలిపారు.రాష్ట్రంలో మైనార్టీలు సంక్షేమం,వారు ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుందని వివరించారు.మైనార్టీల అభివృద్ధి,విద్య,ఉపాధి,సంక్షేమం,హక్కులు గురించి చిత్తశుద్ధితో పనిచేసేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు.దేశంలో బిజెపి అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని,దీంతోనే మార్పు ప్రారంభమన్నారు.పేద,మైనార్టీలు,బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజల తరపున నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు.రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్త పర్యటనలు కూడా సిద్ధంగా ఉంటామన్నారు.కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడానికి కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.



# సత్వర న్యాయానికి లోక్ అదాలత్

## సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్

## డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్

**కడప, ఆగస్టు 31(ప్రజాసీమ)**

ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గంలో పరిష్కరించేందుకు సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపడుతున్నామని డీఎల్ఎస్ఏ చైర్మన్, కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి రామ్‌గోపాల్ తెలిపారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలోని తన ఛాంబర్‌లో పాత్రికేయులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19న బాధ్యతలు స్వీకరించిన అనంతరం జాతీయ లోక్ అదాలత్‌లో గతంలో కంటే అధిక కేసులు పరిష్కరించే లక్ష్యంతో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన, సత్వర న్యాయం అందించడం న్యాయ సేవా సంస్థల ప్రధాన లక్ష్యాలని వివరించారు. సమావేశంలో డీఎల్ఎస్ఏ సెక్రెటరీ, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు. సాధారణ న్యాయ ప్రక్రియతో పోలిస్తే ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాల ద్వారా త్వరగా కేసులు పరిష్కరించుకోవచ్చని, సివిల్ కేసులతో పాటు రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరిస్తున్నామని తెలిపారు.2026 జూలై 11న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడప జిల్లాలో సుమారు 1,05,798 కేసులు పరిష్కరించామని, చిన్నచిన్న క్రిమినల్ కేసులు, రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా కడప జిల్లా రెండో స్థానాన్ని సాధించిందని రామ్‌గోపాల్ తెలిపారు. ఈ విజయానికి జిల్లా యంత్రాంగం, కలెక్టర్, ఎస్పీ, న్యాయవాదులు, బార్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థల సహకారం కీలకమని కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబర్ 12న జరగనున్న లోక్ అదాలత్‌లో గత రికార్డును అధిగమించేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. లోక్ అదాలత్‌లు, న్యాయ సేవలు, ప్రత్యామ్నాయ వివాద పరిష్కార విధానాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని, జాతీయ లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను కోరారు. అన్ని



వర్గాల సమన్వయంతో సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఏపీ స్పోర్ట్స్ పాలసీని 2024-29 అమలు చేయాలి

## - రాష్ట్రంలో ప్రయివేట్ విద్యాసంస్థల్లో క్రీడలను ప్రోత్సాహం

## - కేంద్ర ప్రభుత్వ క్రీడా నిధులను సమర్థ వినియోగం అవసరం

## - జిల్లా కలెక్టరుకి బిజెపి నాయకుల వినతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

భారతీయ జనతా పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి శుక్రవారం జనతా వారధి కార్యక్రమం నిర్వహిస్తోంది.ప్రజల్లో తిరుగుతూ ఎన్నో అంశాలపై చర్చిస్తూ,యువత నుంచి క్రీడల అభివృద్ధి అవకాశాలపై ఎన్నో ఆందోళనలు వచ్చాయి.దీనిపై బిజెపి అన్నమయ్య జిల్లా కార్యదర్శి బర్నేపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఆకుల కృష్ణమూర్తి,మఠం కిరణ్ కుమార్,పూల నాగరాజులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టరుకి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కేవలం విద్యా ఫలితాలు,పరీక్షా మార్కులు,ఉద్యోగ అవకాశాలతో మాత్రమే నిర్ణయించబడదన్నారు.ఆరోగ్యవంతమైన,క్రమశిక్షణ కలిగిన ,మానసికంగా దృఢమైన, సృజనాత్మకమైన యువతను తయారు చేయడానికి విద్యతోపాటు క్రీడలకు సమానమైన ప్రాధాన్యత నివ్వాలన్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడలను విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో భాగంగా కాకుండా కేవలం ఎక్స్‌ట్రా యాక్టివిటీగా చూడటం ఆందోళన కలిగించే అంశమన్నారు.ఏపీ స్పోర్ట్స్ పాలసీ 2024--29ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని,కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న క్రీడా సహాయాన్ని పూర్తిగా వినియోగించాలని,ఖేలో ఇండియా ప్రారంభమైనప్పటి నుంచి 2024 జూలై వరకు ఆంధ్రప్రదేశ్‌లో క్రీడా మౌలిక



వసతుల కోసం రూ.21.91 కోట్లు విడుదలయ్యాయన్నారు.గత ప్రభుత్వ కాలంలో నిర్వహించినఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో క్రీడా సామగ్రి,ప్రైజ్ మనీ,నిర్వహణ తదితర అంశాల్లో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం విచారణకు ఆదేశించినట్లు నివేదికలు వెలువడ్డాయన్నారు.అన్ని క్రీడల్లో విద్యార్థులకు కల్పించి స్పోర్ట్స్ స్టేట్ గా తీర్చిదిద్దాలన్నారు.ఆంధ్రప్రదేశ్ యువతను ఆడే,పోరాడే,గెలిచే,ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వం తోపాటు విద్యాసంస్థలు,తల్లిదండ్రులు మరియు సమాజంపై ఉందని వారు స్పష్టం చేశారు.విద్యతోపాటు క్రీడలు గ్రామస్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభకు అవకాశమనే లక్ష్యంతో సమగ్ర క్రీడా కార్యాచరణను అమలు చేయాలని వినతిపత్రంలో వారు పేర్కొన్నారు.

# సంకటహర చతుర్థి పూజలు

## - విఘ్నేశ్వరుడికి విశేష పూజలు

**వేంపల్లె ప్రజాసీమ:**

స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సంకటహర చతుర్థి పూజలు నిర్వహించినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ వెల్లడించారు. సోమవారం ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విఘ్నేశ్వరుడికి పంచామృత అభిషేకం, నివేదన, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అలాగే సంకటహర చతుర్థి కథలు చదివి వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు భాగ్యలక్ష్మి, మాధవి, నిర్మల, సునిత, హేమ తదితరులు పాల్గొన్నారు.



# సింగిల్ డెస్క్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

## - పరిశ్రమల స్థాపనకు అనుమతులు వేగవంతం చేయాలి

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్





**మదనపల్లె (ప్రజా సీమ) :**

జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన అనుమతులను సకాలంలో మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ నందలి భారత్ సమావేశ హాల్‌లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా జిల్లాలో సింగిల్ డెస్క్ విధానం ద్వారా పరిశ్రమల స్థాపనకు అందుతున్న దరఖాస్తుల పరిష్కారం,చిన్న,మధ్య తరహా పరిశ్రమలకు అందిస్తున్న వివిధ రాయితీలు,పీఎంఈజీపీ పథకం అమలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.గడచిన 89 రోజుల కాలంలో జిల్లాలో వివిధ పరిశ్రమల స్థాపన,అనుమతులు/రీన్యూవల్ కోసం సింగిల్ డెస్క్ విధానంలో మొత్తం 38 దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు.వీటిలో సంబంధిత శాఖల ద్వారా 26 పరిశ్రమలకు అనుమతులు/రీన్యూవల్ మంజూరు చేయగా,మరో 12 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వెల్లడించారు. పరిశీలనలో ఉన్న దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి తగిన పరిష్కారం అందించాలని పర్యావరణ పరిరక్షణ,ఫ్యాక్టరీస్ శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పారిశ్రామికవేత్తలు అనవసర జాప్యానికి గురికాకుండా సింగిల్ డెస్క్ విధానంలో అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించే చర్యల్లో భాగంగా పెట్టుబడి రాయితీ కింద జిల్లాలోని ఉత్పాదక రంగానికి చెందిన 4 యూనిట్లకు మొత్తం రూ.30.78 లక్షల విలువైన రాయితీల మంజూరుకు కమిటీ ఆమోదం తెలిపింది.పీఎంఈజీపీ పథకం ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 74 యూనిట్లకు రూ.2.26 కోట్ల మేర మార్జిన్ మనీ విడుదల కానుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పీఎంఈజీపీ కింద 27 యూనిట్లకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైనట్లు తెలిపారు.పీఎంఈజీపీ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత బ్యాంకులు త్వరితగతిన పరిశీలించి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా పరిశ్రమల శాఖ అధికారులు,బ్యాంకర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ పెట్టుబడులను ఆకర్షించడం,ఉపాధి అవకాశాలను పెంచడం లక్ష్యంగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు.సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ కె.కృష్ణ కిశోర్,ఏపీఐఐసీ తరఫున ప్రవీణ్,వివిధ శాఖల జిల్లా అధికారులు,పరిశ్రమల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్,ఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిసిన జి.శంకర్

**మదనపల్లె (ప్రజా సీమ) :**

తంబళ్లపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా జి.శంకర్ యాదవ్ నియమితులైన సంగతి విధితమే.ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎస్పీ ధీరజ్ కునుబిల్లిలను వారివారి ఛాంబర్లలో మర్యాద పూర్వకంగా కలిశారు.ఇందులో భాగంగా వారికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జి.శంకర్ యాదవ్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధిలో జిల్లా అధికారుల పాత్ర ఎంతో ఉంటుందన్నారు.తంబళ్లపల్లె నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్,శాంతి భద్రతలను పరిరక్షించాలని జిల్లా ఎస్పీని కోరడం జరిగిందన్నారు.జిల్లా కలెక్టర్,ఎస్పీలు ఎంతో సమర్థవంతమైన అధికారులని,జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు.తంబళ్లపల్లి నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్,ఎస్పీలు తెలిపారన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్,పెద్దమండ్యం మండలం అధ్యక్షుడు జిట్టా వెంకటరమణ,తెలుగు యువత రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి,ఎస్టీ సెల్ నాయకులు నటరాజ నాయక్,మనోహర్ నాయక్,మహదేవ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.





# కిడ్నీ ఆపరేషన్‌కు వెళ్లిన వ్యక్తి మృతి.. సమగ్ర విచారణ జరపాలి

## పీలేరు ఎస్.కే.ఆర్. ప్రైవేట్ ఆసుపత్రి ఘటనపై అనుమానాలు నివృత్తి చేయాలి

## అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ డిమాండ్

**పీలేరు మేజర్ న్యూస్ :**

పీలేరు పట్టణంలోని ఎస్.కే.ఆర్. ప్రైవేట్ ఆసుపత్రిలో కిడ్నీలో రాళ్ల సమస్యకు చికిత్స కోసం చేరిన కె. సురేంద్ర (42) మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు దుబ్బా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన వ్యక్తి ఆపరేషన్ సమయంలో మృతి చెందడం ఆందోళన కలిగించే విషయమని ఆయన పేర్కొన్నారు.కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ జాంద్రపేటకు చెందిన కె. సురేంద్ర కిడ్నీలో రాళ్ల సమస్యతో ఈ నెల 26న పీలేరులోని ఎస్.కే.ఆర్. ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆపరేషన్ నిమిత్తం ఆసుపత్రి సిబ్బంది తమ నుంచి రూ.35 వేల నగదు తీసుకున్నారని వారు పేర్కొన్నారు.ఈ నెల 27న సురేంద్రను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లిన కొద్దిసేపటికే ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం స్పృహ కోల్పోవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఎస్వీఐఎంఎస్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఈ ఘటనపై స్పందించిన దుబ్బా శ్రీకాంత్, సురేంద్ర మృతికి అసలు కారణం ఏమిటో అధికారికంగా తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. ఆపరేషన్‌కు ముందు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారా? అనస్థీషియా ఇచ్చిన వ్యక్తి అర్హత కలిగిన నిపుణుడేనా? ఆపరేషన్ సమయంలో రోగి ఆరోగ్య పరిస్థితి ఎందుకు విషమించింది? ఆసుపత్రిలో అత్యవసర వైద్య సదుపాయాలు, ఐసీయూ, వెంటిలేటర్ వంటి సౌకర్యాలు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు పర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు.అదేవిధంగా రోగి పరిస్థితి విషమించిన వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారా? తిరుపతికి తరలించే సమయంలో సురేంద్ర పరిస్థితి ఎలా ఉంది? ఆయనకు అందించిన చికిత్సకు సంబంధించిన రికార్డులు ఏమిటి? అనే అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

**వైద్య రికార్డులు, సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించాలి**

ల్లా స్థాయిలో నిపుణులైన వైద్యులతో



ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసి ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని దుబ్బా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఆపరేషన్ రికార్డులు, అనస్థీషియా వివరాలు, వైద్య నివేదికలు, మందుల వివరాలు, బిల్లులు, ఆసుపత్రి సీసీ కెమెరా ఫుటేజీ తదితర ఆధారాలను అధికారులు పరిశీలించాలని కోరారు.ఆసుపత్రి లైసెన్సులు, వైద్యుల అర్హతలు, అనస్థీషియా నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, అత్యవసర వైద్య సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేదా అన్నది కూడా తనిఖీ చేయాలని ఆయన అన్నారు. విచారణలో వైద్యపరమైన నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన ఉన్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే ప్రజల ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించేలా అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని దుబ్బా శ్రీకాంత్ సూచించారు. సురేంద్ర మృతికి దారితీసిన వాస్తవ కారణాలను అధికారిక విచారణ ద్వారా స్పష్టంగా వెల్లడించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# ఎస్కేఆర్ ఆసుపత్రి సంఘటనపై పూర్తిస్థాయిలో జరిపించాలి

## - వైద్య రికార్డులను సమగ్ర పరిశీలన చేయాలి

## - కాంగ్రెస్,ఎన్ఎస్ యుఐ,ఆప్,ఎన్ఎస్ఎఫ్ నేతల డిమాండ్

## - తక్షణం స్పందించిన జాయింట్ కలెక్టర్ విచారణకు ఆదేశాలు

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పీలేరులో వైద్యం కోసం ఎస్కేఆర్ ఆసుపత్రిని ఆశ్రయించిన ఓ వ్యక్తి చికిత్స సమయంలో మృతిచెందిన ఘటనపై సమగ్ర,నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ అన్నమయ్య జిల్లా సీనియర్ నాయకులు రెడ్డి సాహెబ్,ఎన్ఎస్ యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ,ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు నీరుగట్టు నగేష్,ఆప్ మదనపల్లి ఇంచార్జి సయ్యద్ రహీం,ఏపీవీహెచ్ఎస్ సంతోష్ కుమార్,ఎన్ఎస్ఎఫ్ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు నీల విజయ భాస్కర్,ఏపీసీసీ రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షులు మహమ్మద్ షరీఫ్,కాంగ్రెస్ పార్టీ నిమ్మనపల్లి మండల బీసీ విభాగ మాజీ అధ్యక్షులు ఆర్.నాగరాజ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా జెసికి మదనపల్లిలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరులో చోటుచేసుకున్న ఈ ఘటనపై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేలా అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని నేతలు కోరారు.ఒక వ్యక్తి వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లి చికిత్స సమయంలో మృతి చెందడం తీవ్ర ఆందోళన కలిగించే అంశమని,ఘటనకు దారితీసిన ప్రతి అంశాన్ని నిపుణుల సహకారంతో పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ఆపరేషన్ నోట్స్,అనస్థీషియా చార్ట్,వైటల్ రికార్డులు,మందుల వినియోగ వివరాలు,అంబులెన్స్ రికార్డులు తదితరాలను అధికారులు పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా సంబంధిత ఆసుపత్రిపై గతంలో కూడా ఆరోపణలు, ఫిర్యాదులు ఉన్నట్లు ప్రజల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో గతంలో జిల్లా వైద్యశాఖ అధికారులు నిర్వహించిన తనిఖీలు,తీసుకున్న చర్యలు ఏమిటో కూడా పరిశీలించాలని నేతలు డిమాండ్ చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన అన్నమయ్య జిల్లా జెసి తక్షణమే స్పందించి,ఈ అంశంపై విచారణ చేపట్టాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.వైద్య నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.అదే సమయంలో బాధిత కుటుంబానికి సంబంధిత ఆసుపత్రి యాజమాన్యం ద్వారా రూ.1 కోటి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.వైద్య రంగంలో ప్రజల ప్రాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని,నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులపై కఠినంగా వ్యవహరించాలని,ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా జిల్లా వైద్యశాఖ పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏపీవీహెచ్ఎస్ నేత సంతోష్,ఎన్ఎస్ఎఫ్ వైద్య విభాగం నేత నీల విజయ భాస్కర్ తదితర విద్యార్థి,యువజన,ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.





# తాగునీటి సమస్యతో మదనపల్లె వాసుల సతమతం

## - నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం

## - అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వైఎస్సార్సీపీ వినతి

**మదనపల్లె (ప్రజా సీమ) :**

పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతోపాటు యుద్ధ ప్రాతిపదికన శాండ్ రింగ్ బండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నిసార్ అహమ్మద్ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నిసార్ అహమ్మద్ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తాగునీటి అవసరాలు కూడా రోజురోజుకూ పెరుగుతున్నాయనన్నారు.2011 జనగణన ప్రకారం మదనపల్లె పట్టణ జనాభా సుమారు 1.36 లక్షలు కాగా,ప్రస్తుతం పట్టణ జనాభా సుమారు రెండు లక్షలకు చేరువలో ఉన్నట్లు అంచనాలు ఉన్నాయని తెలిపారు.నీరు వచ్చే సమయంలో నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండాలని అందుబాటులోకి వచ్చే నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని నిసార్ అహమ్మద్ అన్నారు.మాజీ మునిసిపల్ వైస్ జింకా చలపతి మాట్లాడుతూ పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు నీరు వచ్చినా,ఆ నీటిని చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో సురక్షితంగా నిలువ చేసుకునే పరిస్థితులు పూర్తిస్థాయిలో లేకపోతే ప్రజలకు ఆ నీటిని ఎలా అందిస్తారని ప్రశ్నించారు.చిప్పిలి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌కు అనుసంధానం చేసి మదనపల్లెకు తాగునీరు అందించే లక్ష్యంతో ప్రాజెక్టు చేపట్టిన నేపథ్యంలో,నీరు వచ్చే సమయానికి అన్ని రక్షణ చర్యలు పూర్తి చేసి సిద్ధంగా ఉంచడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.నీరు వచ్చిన తర్వాత ఏర్పాట్లు చేయడం కాద,నీరు వచ్చేలోపే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని,మదనపల్లె ప్రజలకు ఉపయోగపడాల్సిన ఒక్క చుక్క నీరు కూడా వృథా కాకుండా చూడాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



అన్నారు.జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్.రెడ్డి,రాష్ట్ర ప్రచార కార్యదర్శి సిపి రాఘవ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు శ్రీనివాసులు,గుండ్లూరు రఫీక్,ఈశ్వర్ నాయక్,ప్రసాద్ బాబు,పాల్ చంద్రశేఖర్,సుధాకర్,మాజీ సర్పంచులు లు నాగరాజ రెడ్డి, శరత్ రెడ్డి,తట్టి నాగరాజ రెడ్డి,నాయకులు జన్నే రాజేంద్ర నాయుడు,యూనస్, కొత్తపల్లి మహేష్ బాబు,ఎన్.నవాజ్ అలీ ఖాన్,తాజ్ భాషా,సాదిక్,యాసీన్,నూర్ మొహమ్మద్ ఖాన్ ,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,మాధవ రెడ్డి,సాంబశివా రెడ్డి,సోమశేఖర్ రెడ్డి,బొమ్మిశెట్టి మధు,రాజేష్,మయూరి రెడ్డి,ఆవుల విశ్వనాథ్,వడిగల శ్రీకాంత్ ,తాళే సుబ్రహ్మణ్యం, చరణ్,జాఫర్, రియాజ్,జైనుల్లా ,వినుత బాయి,మంజుల, నాగమణి,షేక్ షమ,మహేశ్,షేక్ జబి,ముజీబ్,ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసీమ

# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

## ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్

మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్స్‌నే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై-వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మల్లెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే



దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు.క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించ్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలోక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెంన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక



షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం



వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.

# కిరణ్ అబ్బవరం మూవీకి హతః టైటిల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్బు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.



Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma